ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
బుధవారం 17 జూన్ 2026 | www.prajajyothinews.com | పేజీలు :10

# జూన్ 30లోపు అందుబాటులో ఉన్న నరేగా నిధులు పూర్తిగా వినియోగించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రణాళిక చేసిన అన్ని పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలి
-సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, వీఓ భవనాలు, కల్వర్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
-జిల్లాకు కేటాయించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్






- కేంద్రం మార్పుతో కస్టమర్లకు చుక్కలు.. బుకింగ్ ఒకచోట, డెలివరీ మరోచోట
- వాహనాల ప్రవేశంపై ఆంక్షలు.. బస్సుల మార్గంలోనే సరుకుల గుట్టలు
- సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనతపై వినియోగదారుల ఆగ్రహం

# కరీంనగర్ ఆర్టీసీ కార్గో కేంద్రంలో గందరగోళం




కరీంనగర్ బ్యూరో,జూన్ 16 (ప్రజాజ్యోతి ): ప్రజలకు వేగవంతమైన పార్శిల్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నడుస్తున్న ఆర్టీసీ కార్గో సేవలు కరీంనగర్‌లో ప్రస్తుతం వినియోగదారులకు ఇబ్బందుల పర్యాయపదంగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కార్గో కేంద్రాన్ని పాత ప్రదేశం నుంచి బస్ స్టాండ్ ప్లాట్‌ఫాం పక్కకు తరలించిన తర్వాత కస్టమర్లు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వ్యాపారులు, చిన్న వ్యాపార సంస్థల ప్రతినిధులు, సాధారణ ప్రజలు, ప్రయాణికులు

11లో..

# ఫ్లెక్సీల ఖర్చు గ్రామాభివృద్ధికి వినియోగించండి”

- ఎంపీ ధర్మపురి అరవింద్

రాయికల్,జూన్ 16 (ప్రజా జ్యోతి) జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్ మండలం ధర్మాజీపేట గ్రామంలో రూ.23 లక్షల వ్యయంతో (రూ.20 లక్షలు కేంద్ర ప్రభుత్వం, రూ.3 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం) ఏర్పాటు చేసిన ఆయుష్మాన్



# కరీంనగర్‌లో స్కూల్ వాహనాలపై పోలీస్-ఆర్టీఏ కొరడా

- నిబంధనలు ఉల్లంఘించిన 17 బస్సులు,70 ఇతర వాహనాలు సీజ్
- భద్రతా ప్రమాణాలు పాటించని డ్రైవర్లకు సీపీ గౌస్ ఆలం హెచ్చరిక



# ఐదు హామీలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-త్వరలో కొత్త పెన్షన్స్**


**-శ్రీగాధ లో సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పర్శ హన్మాండ్లు**



**గంభీరావుపేట జూన్ 16 ( ప్రజా జ్యోతి):** ఎన్నికలలో ఇచ్చిన ఆరు హామీలలో అయిదు హామీలను సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యం లోనీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. మంగళవారం రోజున గంభీరావుపేట మండలంశ్రీగాధ గ్రామం లో గౌరినేని చంద్రకళ,సుద్దాల మైసయ్య,కల్వకుంట్ల నర్సింగరావు లు అనే ముగ్గురు లబ్ధిదారులకు లక్ష రూపాయల సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులను పర్శ హన్మాండ్లు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ,కొత్త రేషన్ కార్డులు మంజూరు,రైతు రుణమాఫీ వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని మిగిలిన కొత్త పెన్షన్స్ పథకం మాత్రం అతి త్వరలోనే అమలుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పర్శ హన్మాండ్లు అన్నారు,బీద ప్రజలకు సీ ఎం ఆర్ ఎఫ్ ఒక వరం అని అన్నారు,బీద ప్రజలు అనారోగ్య సమస్యలు వచ్చినపుడు అధైర్య పడవద్దని అన్నీ హాస్పిటల్స్ లలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఇరవై లక్షల రూపాయల వరకు మెరుగైన ఉచిత వైద్య చికిత్సలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్నట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అర్హులైన ప్రతి ఒక్కరికి విడుతల వారీగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నదన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బందెల రాజు,సింగల్ విండో డైరెక్టర్ గౌరినేని భగవంత రావు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు వేముల శ్రీనివాస్ గౌడ్,తొండ్ల దేవేంద్ర నర్సింలు,నాయకులు బందెల బాలరాజు,గౌరినేని శ్రావణ్ రావు,పర్శ శ్రీనివాస్,బందెల భిక్షపతి,వేముల యాద గౌడ్,గౌరినేని నర్సింగా రావు,బందెల సంజీవ్,బూమలింగం ,అక్షయ్,యోసెఫ్ ,వెంకట్రావ్, మహేష్, రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 24న కోడెల పంపిణీ రవీందర్ రెడ్డి జిల్లాపశు సంవర్ధక అధికారి



**వేములవాడ,జూన్,16:ప్రజాజ్యోతి.** ఈ నెల 24వ తేదీన వేములవాడ తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని 100 కోడె జతలను బుధవారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాల రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులు అర్హులని, వారు వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ https://rajannasircilla.telangana.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న రైతులు దానికి సంబంధించిన పత్రాలతో ఈ నెల 24వ తేదీన బుధవారం ఉదయం 08.00 గంటలలోగా రైతులు రావాలని తెలిపారు. అర్హులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు.జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు, కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు. పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కోడెలు తీసుకున్న రైతులు, వారి కుటుంబ సభ్యులు అర్హులు కాదని స్పష్టం చేశారు.

# పది లక్షల సీసీ రోడ్డుకు భూమి పూజ .....సర్పంచ్ నాగరాజు

**ఎల్లారెడ్డిపేట జూన్ 16( ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామంలోని పోచమ్మ గుడి ముందు నుండి గట్టు మల్లికార్జున స్వామి గుడి వరకు సర్పంచ్ రోడ్డుకు భూమి పూజ చేశారు. గ్రామానికి 10 లక్షల సీసీ రోడ్డు మంజూరు అయిందని మహిళా సమైక్య భవనం 10 లక్షల రూపాయలు గ్రామ అభివృద్ధికి సహకరించిన మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, సర్పంచ్ దొమ్మాటి నరసయ్య ,ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ,రవాణా శాఖ మంత్రి ప్రభాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు యాదవ్ ,గుమ్మడి సతీష్ ,వార్డ్ సభ్యులు పంతంగి సతీష్, ఉప్పల ఎల్లారెడ్డి ,సెక్రటరీ రమేష్, చీకట్ల శ్రీనివాస్ , రామచంద్రపురం ,మల్లారెడ్డి, చెక్కల ప్రభాకర్ ,చీకట్ల నారాయణ స్వామి, మల్లయ్య, రామస్వామి, దేవయ్య, తిరుపతి, కార్తీక్ , వెంకట్రామిరెడ్డి ,ఆగయ్య, బాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# గంగాధర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర జూన్ 16: (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోనీ మధుర నగర్లో నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతులు నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండే oదుకు ప్రస్తుతానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంపై అదనపు తరగతి గదులను నిర్మించాలని నిర్ణయించారు. ఈ విషయమై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్‌తో ఫోన్ లో మాట్లాడారు. తక్షణమే గదుల నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం, డిగ్రీ కళాశాల శాశ్వత భవన నిర్మాణం కొరకు మండల పరిధిలోని మధురానగర్‌లో అనువైన స్థలాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగాధర ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, కళాశాల భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దమ్మని రాము,ఎమ్మార్వో అంబటి రజిత,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్,కాంగ్రెస్ నాయకులు అట్ల శేఖర్ రెడ్డి,పెంచాల చందు,దాతు అంజి,మేర్గ కొండయ్య,బైరిశెట్టి సంపత్ ,గుండవేని తిరుపతి పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న ప్రజాప్రతినిధి

**– అనారోగ్య బాధితుడికి నెలనెలా అండగా కౌన్సిలర్ సంపత్**



**పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 16 ప్రజా జ్యోతి;** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను మరచిపోకుండా ఆచరణలో చూపిస్తూ 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెద్దపల్లి పట్టణంలోని 18వ వార్డుకు చెందిన వేల్పుల రాజేశం అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న సంపత్, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధులతో ప్రతి నెలా ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ఈ నెలకు సంబంధించిన పెన్షన్‌ను మంగళవారం రాజేశంకు అందజేసిన కౌన్సిలర్ సంపత్, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు తోడుగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే తన లక్ష్యమని ఆయన అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రాజేశంకు నిరంతరం సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుతున్న సంపత్ సేవలను స్థానికులు అభినందించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమమే ముఖ్యమనే భావనతో ఆయన చేస్తున్న సేవలు ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రాజేశం (బంగ్లా), వేల్పుల కనకయ్య, మౌటం ఆశాలు, వేల్పుల సంతోష్, గంగుల సంతోష్ పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి




**ఇల్లంతకుంట జూన్ 16 (ప్రజజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ప్రజలు ఈ నెల 20న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వి నియోగం చేసుకోవాలని ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ మంగళవారం రోజు పిలుపునిచ్చారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరిం చుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమయం, ఖర్చు ఆదా చేసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారానికి సంబం ధిత పక్షాలు సహకరించాలని కోరారు.రాజీ పడ దగిన కేసులకు ఇరువర్గాల పరస్పర అంగీకారంతో క్రిమినల్ కంపోండబుల్ కేసులు,సివిల్ వివాదాలు,ఆస్తి విభజన కేసులు,కుటుంబ, నిర్వహణ కేసులు,వైవాహిక వివాదాలు,బ్యాంకు రికవరీ కేసులు,విద్యుత్ చౌర్యం కేసులు,చెక్ బౌన్స్ కేసులు,డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు,చిన్నచిన్న పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడ దగిన కేసులు పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు.

## బాలల స్నేహపూర్వక మండలంగా తిమ్మాపూర్‌ను తీర్చిదిద్దుదాం



**తిమ్మాపూర్,జూన్ 16 ( ప్రజాజ్యోతి )**బాలల స్నేహపూర్వక మండలంగా తిమ్మాపూర్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ముందడుగు వేస్తున్నాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో 'స్నేహ కిషోర్ బాలికల సంఘాల'కు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సదస్సులో బాలికలకు సమాజంలో ఎదురయ్యే పలు అంశాలపై కులంకషంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా మిషన్ వాత్సల్య,చైల్డ్ హెల్ప్ లైన్ సేవలు,ఆపదలో ఉన్న పిల్లలను ఆదుకునేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవల గురించి వివరించారు.బాల్య వివాహాల నిరోధం,బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి వల్ల బాలికల భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందనే విషయాలను నొక్కి చెప్పారు. ఆరోగ్యం జీవన నైపుణ్యాలు సమాజంలో ఏర్పడే రుగ్మతలను ఎలా ఎదుర్కోవాలో తెల్పుతూ జీవన నైపుణ్యాలు, న్యూట్రిషన్ ఆహార సమతుల్యత, హెల్త్ అండ్ శానిటేషన్, మరియు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం సంపత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, మిషన్ వాత్సల్య ప్రతినిధి సాదినేని రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది సుందరగిరి సాయికిరణ్ గౌడ్,ఎడ్ల ప్రియాంకలతో పాటు హెల్త్ సిబ్బంది, మహిళా సంఘాల వివోఏలు పెద్ద సంఖ్యలో కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# భూకబ్జా కుట్ర వెనుక ప్రభుత్వ ఉద్యోగి హస్తం

### -రాజకీయ అండదండలతోనే ఈర్ల సురేందర్ భూ సెటిల్మెంట్లు చేస్తున్నాడు

### -సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




**పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 16 ప్రజా జ్యోతి;**పెద్దపల్లి మండలం రంగంపల్లి శివారులోని 66/బీ సర్వే నంబర్‌లో తనకు చెందిన భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు కుట్ర జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆరోపించారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2012లో పెర్క మొండయ్య నుంచి సదరు భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు సదానందం తెలిపారు. భూమికి సంబంధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టా పాసుపుస్తకాన్ని మంజూరు చేసిందని చెప్పారు. ఈ నెల 8న భూమిని చదును చేసే పనులు చేపడుతుండగా ప్రభుత్వ ఉద్యోగి ఈర్ల సురేందర్ అడ్డుకుని తమపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజల పన్నులతో జీతం పొందుతూ ఉద్యోగం చేస్తున్న ఈర్ల సురేందర్ భూదందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆయన ప్రోద్బలంతోనే కొందరు వ్యక్తులు తమ భూమిపై హక్కులు ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ కబ్జా యత్నాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై జూన్ 9న పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. భూ వివాదంలో పెర్క రాజేశంకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్న సదానందం, ఇటీవల నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. 1983లో భూమిని కొనుగోలు చేశామని కొందరు చెబుతున్నారని, నిజంగా అప్పుడే కొనుగోలు చేసి ఉంటే ఎందుకు పట్టా చేయించుకోలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తాను ఎవరినీ మోసం చేయలేదని, ఎవరి వద్ద నుంచీ బలవంతంగా సంతకాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. ఈర్ల సురేందర్ ఎవరి అండతో సెటిల్‌మెంట్లు చేస్తున్నాడో ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని ఆరోపించారు. తనపై అసత్య ప్రచారం చేసిన పెర్క శ్రవణ్, పెర్క రాజేశం, పెర్క లక్ష్మణ్‌లపై పరువు నష్టం దావా వేయనున్నట్లు హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగుతూ భూదందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారంటూ ఈర్ల సురేందర్‌పై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆయనపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెర్క మొండయ్య మాట్లాడుతూ, తమ తాతల నుంచి వారసత్వంగా వచ్చిన 8 గుంటల భూమిని ఆర్థిక అవసరాల దృష్ట్యా 2012లో తాండ్ర సదానందంకు విక్రయించినట్లు తెలిపారు. ఈ విషయంలో అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పెర్క మొండయ్య, బోంకూరి ఎల్లయ్య, పెర్క శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 30లోపు అందుబాటులో ఉన్న నరేగా నిధులు పూర్తిగా వినియోగించాలి

: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

...ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రణాళిక చేసిన అన్ని పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలి

..సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, వీఓ భవనాలు, కల్వర్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

..జిల్లాకు కేటాయించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి

..పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, ప్రతినిధి జూన్-16 ప్రజా జ్యోతి;**జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న నిధులను జూన్ 30 లోపు పూర్తిస్థాయిలో వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాటాడుతూ, జిల్లాకు ప్రస్తుతం ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.19 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, ఈ నిధులను జూన్ 30లోపు పూర్తిగా ఖర్చు చేయడం లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రణాళిక చేసిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు అవసరమైన కొత్త పనులను కూడా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, వీఓ భవనాలు, కల్వర్టులు తదితర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు.జిల్లాకు కేటాయించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించి, నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఎంఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టే పనులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడటంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా పెంచుతాయని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి పనిని లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసి నిధుల వినియోగంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య , డి.ఈ.లు, ఏఈ లు,ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీలో ఆధునిక సాంకేతికతపై అవగాహన

## - పెద్దపల్లిలో విజయవంతంగా నికాన్ ఫోటోగ్రఫీ వర్క్‌షాప్




**పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 16 ప్రజా జ్యోతి;**ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, సాంకేతిక అభివృద్ధిని అందిపుచ్చుకుని నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని నిపుణులు సూచించారు. పెద్దపల్లి జిల్లా ఫోటో ఼ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నికాన్ కంపెనీ సహకారంతో ఫోటోగ్రాఫర్ల కోసం మంగళవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం విజ యవ ంతంగా జరిగింది.ఈ సందర్భంగా నికాన్ ఫ్యాకల్టీ శరవణ కుమార్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులు, నూతన కెమెరాల వినియోగం, ఫోటో నాణ్యత పెంపు, ఆధునిక ఫోటోగ్రఫీ పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు తమ వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఫోటోగ్రాఫర్లు హాజరై శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారు నికాన్ నూతన కెమెరాల ఫీచర్లు, ఆధునిక ఫోటోగ్రఫీ టెక్నిక్స్‌పై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.జిల్లా ఫోటో ఼ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఈ శిక్షణా కార్యక్రమం ఫోటోగ్రాఫర్లకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో ఼ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెర్ల ఉదయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఇర్ఫాన్, జిల్లా కోశాధికారి అల్లం సతీష్, నికాన్ కంపెనీ ప్రతినిధులు, జిల్లా వ్యాప్తంగా పలువురు ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో స్కూల్ వాహనాలపై పోలీస్-ఆర్టీఏ కొరడా

## - నిబంధనలు ఉల్లంఘించిన 17 బస్సులు,70 ఇతర వాహనాలు సీజ్
## - భద్రతా ప్రమాణాలు పాటించని డ్రైవర్లకు సీపీ గౌస్ ఆలం హెచ్చరిక







**కరీంనగర్ క్రైం, జూన్ 16, ప్రజాజ్యోతి:** పాఠశాలలకు వెళ్లే చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విద్యార్థుల రవాణా వాహనాలపై మంగళవారం ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించా రు,పోలీస్ శాఖ,రోడ్డు రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు సంయుక్తంగా చేపట్టిన ఈ తనిఖీల్లో భారీ ఎత్తున నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలు వెలుగులోకి వచ్చాయి. ఫిట్‌నెస్ సర్టిఫి ్ కట్ లేకుండా,సరైన పత్రాలు లేకుండా,ఓవర్‌లోడింగ్‌తో విద్యార్థుల ను తరలిస్తున్న అనేక వాహనాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు.తనిఖీల సందర్భంగా విద్యార్థుల రవాణాకు వినియోగిస్తున్న వాహనాల ఫిట్‌నెస్,పర్మిట్లు,ఇన్సూరెన్స్,డ్రైవింగ్ లైసెన్స్‌లు, భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా నిబంధనలు అతిక్రమి స్తున్న వాహనాల యజమానులు,డ్రైవర్లపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ప్రత్యేక తనిఖీల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని 17 స్కూల్ బస్సులు,50 ఆటోలను అధికారులు సీజ్ చేశారు. అలాగే రిజిస్ట్రేషన్, పర్మిట్,ఇన్సూరెన్స్ వంటి కీలక పత్రాలు లేని 64 వాహనాలపై కేసులు నమోదు చేశారు.యూనిఫాం ధరించకుండా విధులు నిర్వహిస్తున్న 13 మంది డ్రైవర్లపై చర్యలు తీసుకోగా,నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న ఒక వాహనాన్ని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టారు.అదనంగా ఓవర్‌లోడింగ్‌తో విద్యార్థులను తరలిస్తున్న 9 వాహనాలపై కూడా కేసులు నమోదు చేశారు.మొత్తం 87 వాహనాలపై వివిధ రకాల ఉల్లంఘనలను నమోదు చేసినట్లు సీపీ గౌస్ ఆలం వెల్లడించారు.ఈ సందర్భంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు,మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను తరలించే సమయంలో అధిక వేగం,నిర్లక్ష్య డ్రైవింగ్,మొబైల్ ఫోన్ వినియోగం వంటి చర్యలు ఎంత ప్రమాదకరమో వివరించారు.పాఠశాల వాహనాల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్,ఫైర్ ఎక్స్‌టింగ్విషర్,అత్యవసర నిష్క్రమణ ద్వారాలు, స్పీడ్ గవర్నర్లు వంటి భద్రతా పరికరాలు ఉండాలని సూచించారు.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, “ప్రతి చిన్నారి సురక్షితంగా పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోవడం మనందరి బాధ్యత. విద్యార్థుల ప్రాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించం. పాఠశాల వాహనాల యజమానులు, డ్రైవర్లు చట్టబద్ధమైన అన్ని పత్రాలను కలిగి ఉండటంతో పాటు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి.వేగ పరిమితులు ఉల్లంఘించడం,డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు” అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు యాదగిరిస్వామి,వెంకటస్వామి,మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి. కవిత,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్యతో పాటు పోలీస్,ఆర్టీఏ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని పెండింగ్ కేసులు పరిష్కరించుకోండి: ఎస్సై రమేష్...




**వేములవాడ,జూన్,16:ప్రజాజ్యోతి.** చందుర్తి మండల ప్రజలు ఈ నెల 20న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని చందుర్తి ఎస్సై జిల్లెల్ల రమేష్ పిలుపునిచ్చారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమయం, ఖర్చు ఆదా చేసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారానికి సంబంధిత పక్షాలు సహకరించాలని కోరారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

## పెండింగ్ కేసులు పరిష్కరించుకోండి:వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం



**వేములవాడ,జూన్,16:ప్రజాజ్యోతి.**వేములవాడ రూరల్ మండల ప్రజలు ఈ నెల 20న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ రూరల్ ఎస్ ఐ వెంకట్రాజం పిలుపునిచ్చారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమయం, ఖర్చు ఆదా చేసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారానికి సంబంధిత పక్షాలు సహకరించాలని కోరారు.రాజీ పడ దగిన కేసులకు ఇరువర్గాల పరస్పర అంగీకారంతో క్రిమినల్ కంపోండబుల్ కేసులు,సివిల్ వివాదాలు,ఆస్తి విభజన కేసులు,కుటుంబ, నిర్వహణ కేసులు,వైవాహిక వివాదాలు,బ్యాంకు రికవరీ కేసులు,విద్యుత్ చౌర్యం కేసులు,చెక్ బౌన్స్ కేసులు,డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు,చిన్నచిన్న పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడ దగిన కేసులు పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు.

## భారీ వర్షాలకు దెబ్బతిన్న గృహాలను పరిశీలించి.. కుటుంబ సభ్యులకు బియ్యం పంపిణీ చేసిన బిజెపి నాయకులు



**గంభీరావుపేట జోన్ 16 ( ప్రజా జ్యోతి):**గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట గ్రామంలో ఇటీవల ఈదురు గాలులకు, వర్షం కారణంగా నష్టపోయిన కుటుంబాలను మంగళవారం పరామర్శించిన భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల శాఖ నాయకులు. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకుని, తక్షణ సహాయం క్రింద గుగులోత్ పర్శరాములు, భూక్యా దేవేందర్ , గుగులోతు మంగు మూడు కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేసిన నాయకులు. ఈ సందర్భంగా కోడె రమేశ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని ఆదుకోవాలని కోరారు. నిజంగా ఇళ్లు అవసరమైన పేదలకి అందకుండా, రాజకీయ ప్రాభవం ఉన్నవారికి, మధ్యవర్తులకు లబ్ధి చేకూరే విధంగా వ్యవస్థ మారిపోయిందని అర్హుల ఎంపికలో పారదర్శకత , లేదని అవినీతి, సిఫార్సుల పాలన కారణంగా నిజమైన లబ్ధిదారులు ఇంకా సంవత్సరాలు తరబడి ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీ రామారావు ఎన్నికలకు ముందు వారంలో రెండు రోజులు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పి ప్రకృతి వైపరీత్యాలకు , సమస్యల పట్ల ప్రజలకు ఏనాడు అందుబాటులో ఉండకుండా రాష్ట్రం మీద పడి ఏతులు చెప్పడమే తప్ప నియోజకవర్గాలకు ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేడు. కేవలం ఎన్నికలప్పుడే కేటీఆర్ గారికి సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు గుర్తుకు వస్తారని ప్రజల సమస్యలకు ఏనాడు అందుబాటులో ఉండని కేటీఆర్ ఎమ్మెల్యే పదవికి అనార్హుడు అని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ గృహాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ నాయకులు డాక్టర్ సత్యనారాయణ దేవేందర్ గౌడ్ తిరుపతి శ్రీనివాస్ నర్సింలు దేవేందర్ యాదవ్ నరేష్ నవీన్ రమేష్ ప్రభాకర్ ఎల్లం గణేష్ స్వామి శ్రీనివాస్ నాజం దేవయ్య మధు నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పనులు చివరి దశకు తహసీల్దార్




**ఇల్లంతకుంట జూన్ 16 (ప్రజజ్యోతి)**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పనులు దాదాపుగా పూర్తయ్యాయని తహసీల్దార్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రహీంఖాన్‌పేట, దాచారం, అనంతగిరి, పెద్దలింగాపూర్ కేంద్రాల పనులు రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బంది పడవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

# నారాయణపూర్ 9వ వార్డులో మెడికవర్ ఉచిత వైద్య శిబిరం

**– 158 మందికి వైద్య సేవలు.. బీపీ, షుగర్, గుండె పరీక్షలు**

**– అవసరమైన వారికి ఉచిత మందుల పంపిణీ**



**సుల్తానాబాద్, జూన్ 16: (ప్రజా జ్యోతి)** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామం అంబేద్కర్ కాలనీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 9వ వార్డు సభ్యుడు కల్లెపెల్లి దేవేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి కాలనీ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సుమారు 158 మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు అందించారు. రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), గుండె సంబంధిత వ్యాధులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. వైద్య నిపుణులు ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక సూచనలు అందించడంతో పాటు అవసరమైన చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన రోగులను పరీక్షించిన వైద్యులు వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా తగిన వైద్య సలహాలు అందించారు. మందులు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన వృద్ధులు, మహిళలు, యువకులు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటిని మరిగిం చి ఉపయోగించడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు. అలాగే రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధు లు ఉన్నవారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందించడంతో పాటు ఆరోగ్య సమస్యలను అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం ఒకసారి పూర్తి స్థాయి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మెడికవర్ హాస్పిటల్ తరచూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శివకుమార్, సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మేనేజర్ కోట కరుణాకర్, మార్కెటింగ్ ప్రతినిధులు శ్రీకాంత్, సంజీవ్, ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. శిబిరం విజయవంతానికి సహకరించిన మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యానికి కాలనీ ప్రజలు, 9వ వార్డు సభ్యుడు కల్లెపెల్లి దేవేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



**కరీంనగర్ బ్యూరో, జూన్ 16( ప్రజాజ్యోతి )** కరీంనగర్ నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన సన్నద్ధత కార్యక్రమాలను పరిశీలించిన ఆమె, తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజన వంటగది, పాఠశాల ప్రాంగణం, మంచినీటి ట్యాంకులు, ఆట స్థలం తదితర మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన డాక్టర్ అశ్విని తానాజీ వాకడే విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలిస్తూ రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు చక్కటి చేతిరాత అలవాటు చేయడంతో పాటు వివిధ సబ్జెక్టుల్లో ప్రాథమిక భావనలపై బలోపేతమైన శిక్షణ అందించాలని ఆదేశించారు. సాంఘిక శాస్త్రంలో భాగంగా రాష్ట్రాలు రాజధానులు, ప్రధాన నదులు, భారతదేశం మరియు తెలంగాణ రాష్ట్ర పటాలను విద్యార్థులతో గీయించి వారి అవగాహనను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ఇతర అవసరాలపై వివరాలను తెలియజేయాలని ప్రధానోపాధ్యాయులను ఆమె కోరారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠ్యపుస్తకాల పంపిణీ, పాఠశాల సన్నద్ధత కార్యక్రమాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరిన్ని మెరుగుదలల కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి, సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాలికకు న్యాయం జరిగే వరకు పోరాడుతం

## - రజక సంఘం మానకొండూర్ నియోజకవర్గం ఇంచార్జ్: నాంపెల్లి శంకరయ్య డిమాండ్..



శంకరపట్నం:జూన్16(ప్రజా జ్యోతి) 12 ఏళ్ల బాలికపై ఖమ్మం జిల్లాలో మహమ్మద్ గౌస్ పాషా అనే వ్యక్తి లైంగికంగా దాడి చేసి మేడ పైనుంచి తోసి వేయడం అత్యంత దారుణమని రజక సంఘం మానకొండూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ నాంపెల్లి శంకరయ్య అన్నారు.శంకరపట్నం మండలం మొలంగూర్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ,, బాధిత కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 లక్షలు వెంటనే అందజేసి బాలిక పేరు పై కోటి రూపాయలు బ్యాంకులో డిపాజిట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఇలాంటి అమానుష ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించి గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న బాలిక జీవితం ఈ దారున ఘటనతో తీవ్రంగా దెబ్బతిన్నదని ఆయన మండిపడ్డారు.నిందితుడిని చట్టపరంగా కఠిన శిక్ష విధిస్తూ బాదిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అలాగే ఈ ఘటనపై సమాజంలోని ప్రతి ఒక్కరు స్పందించి బాధిత కుటుంబానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు రజక సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు సాయిలు,గ్రామ ఉప సర్పంచ్ దండు రాజేష్,రజక సంఘం నాయకులు తాడిచెర్ల లక్ష్మీపతి,తదితరులు ఉన్నారు.

# స్వతంత్ర మైక్రో ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు

## – 19న జాబ్ మేళా
## – జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్



పెద్దపల్లి ప్రతినిధి, జూన్ -16 ప్రజా జ్యోతి:జిల్లాలోని నిరుద్యోగ యువకులకు స్వతంత్రం మైక్రో ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 19 శుక్రవారం రోజున జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్వతంత్ర మైక్రో ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో మొత్తం 40 ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణతతో బైకు, డ్రైవింగ్ లైసెన్స్ గల అభ్యర్థులు అర్హులని, వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలని అన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.14 వేల నుండి రూ.15 వేల వరకు వేతనం, 6 వేల వరకు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు, ఎంపికైన అభ్యర్థులు సుల్తానాబాద్ చెన్నూరు మంథని జగిత్యాల మెట్పల్లి నిర్మల్ భూపాల్ పల్లి లక్ష్మీపేట ప్రాంతాలలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.ఆసక్తి ఉన్నవారు జూన్ 19న ఉదయం 11 గంటలకు సర్టిఫికేట్స్ జిరాక్స్ కాపీలు, అప్డేటెడ్ బయోడేటా/రెజ్యూమే, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో పాటు అనుభవం ఉంటే ఎక్స్పీరియన్స్ లెటర్ తీసుకొని రూమ్ నెంబర్ 233, మొదటి అంతస్తు, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం పెద్దపల్లిలో హాజరై తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 80 ట్రాక్టర్ల ఇసుక సీజ్

కరీంనగర్ క్రైం, జూన్ 17, ప్రజాజ్యోతి:కొత్తపల్లి మండలంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన మెరుపు దాడుల్లో రెండు భారీ అక్రమ ఇసుక డంప్‌లు బయటపడ్డాయి .రాములపల్లి గ్రామంలో 50కు పైగా, శాంతినగర్‌లో 30కు పైగా ట్రాక్టర్ల లోడ్ల ఇసుకను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.మొత్తం 80కు పైగా ట్రాక్టర్ల లోడ్ల అక్రమ ఇసుకను పట్టుకుని తదుపరి చర్యల కోసం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ గౌస్ ఆలం హెచ్చరించారు.



## చెరువులోబట్టలుఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి యువతి మృతి



గంభీరావుపేట జూన్ 16 ( ప్రజా జ్యోతి) :గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మంగళవారం రోజున చెరువులో పడి బంటు జ్యోతి (25) సంవత్సరాలు యువతి మృతి చెందింది, విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి ఎస్సై శ్రీకాంత్ వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి :ఏఈ ఆనంద్

గంభీరావుపేట జూన్ 16 (ప్రజా జ్యోతి); విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కోసం ( సి జి ఆర్ ఎఫ్) సమావేశం గురువారం రోజున ఉదయం 10:30 గంటలకు ఎల్లారెడ్డిపేటలో నిర్వహించడంజరుగుతుందని. ఏఈ ఆనంద్ తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ,గంభీరావుపేట మండల పరిధిలోని అన్ని గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ విద్యుత్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలు మరియు వినతులను పరిష్కరించుకోవాలని విద్యుత్ వినియోగదారులను కోరారు.

## బడిబాట కార్యక్రమం



కొనరావుపేట, జూన్.16(ప్రజాజ్యోతి) కొనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిర్యాల్ కార్ బాలాజీ, మాట్లాడుతూ .ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య తో పాటు ఉచిత యూనిఫాం అందిస్తున్నారని తెలిపారు.అలాగే మన గ్రామంలో నీ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ కంప్యూటర్ శిక్షణ క్లాసులు మరియు బాయ్స్ హాస్టల్ వసతి కూడా అందుబాటులో ఉందని తెలిపారు.అలాగే కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలిశాల శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి మనీషా,వార్డ్ సభ్యులు కిసారీ కావేరి,పొన్నం లక్ష్మీ,దువ్వల అజయ్,అంగన్వాడి టీచర్ లు ఆశావర్కర్లు ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి:

కోనరావుపేట ఎస్సై ఖ ప్రశాంత్ రెడ్డి:



కోనరావుపేట, జూన్ .16 (ప్రజా జ్యోతి) కోనరావుపేట మండల ప్రజలు ఈ నెల 20 న నిర్వహి ంచనున్న లోక్ అదాలత్‌ను సద్వి నియోగం చేసుకోవాలని కోనరావుపేట ఎస్సై ఖ ప్రశాంత్ రెడ్డి, పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించు కునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమయం, ఖర్చు ఆదా చేసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారానికి సంబంధిత పక్షాలు సహకరించాలని కోరారు. రాజీ పడ దగిన కేసులకు ఇరువర్గాల పరస్పర అంగీకారంతో క్రిమినల్ కంపోండబుల్ కేసులు,సివిల్ వివాదాలు,ఆస్తి విభజన కేసు లు,కుటుంబ, నిర్వహణ ,వైవాహిక వివాదాలు,బ్యాంకు రికవరీ విద్యుత్ చౌర్యం ,చెక్ బౌన్స్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మరియు ఇతర రాజీ పడ దగిన కేసులు పరిష్కరించుకోవచ్చు అని ఎస్సై తెలిపారు.

# జిల్లాలో అక్రమ చేపల చెరువుల కూల్చివేత

– జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి, జూన్ – 16 ప్రజా జ్యోతి:జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ చేపల చెరువులను అధికారులు కూల్చివేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కూల్చివేతల ద్వారా జిల్లావ్యాప్తంగా మొత్తం 22 అక్రమ చేపల చెరువులను తొలగించడం జరిగింది. ఇందులో ముర్మూర్ గ్రామంలో 17, సోమన్‌పల్లి గ్రామంలో 2, పొట్యాల గ్రామంలో 2, ఎల్లంపల్లి గ్రామంలో 1 చొప్పున అక్రమ చెరువులను గుర్తించి తొలగించామని,ఈ చర్య ద్వారా గత 6 సంవత్సరాలుగా ఆక్రమణకు గురైన సుమారు 80 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కూల్చివేత ప్రక్రియలో నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, మత్స్య శాఖల అధికారులు సమన్వయంతో పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను అనుమతి లేకుండా ఆక్రమిస్తే, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం

ఇల్లందకుంట, జూన్ 16(ప్రజాజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇల్లందకుంట ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2026--27 విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతిలో కొత్తగా నమోదైన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి కే. రాములు మాట్లాడుతూ, 2025--26 విద్యా సంవత్సరం నుంచి ఇల్లందకుంట ప్రాథమిక పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ ప్రీ–ప్రైమరీ తరగతులు ప్రారంభించామని తెలిపారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ ప్రీ–ప్రైమరీ పిల్లలతో పాటు ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులను ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ మరియు ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించాలని కోరారు.అదేవిధంగా ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులను పీఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్ ఇల్లందకుంట పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ



పాఠశాలల్లో టెట్ అర్హత కలిగిన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నం దున, నాణ్యం ైన విద్య కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ప్రాధాన్యంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్ర మంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ నజ్నీన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. గోపి, ఉపాధ్యాయులు బి. వరలక్ష్మి, సార్ల సంపత్, జె. వీరస్వామి, కె. నిరోషతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్ర మం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# వేములవాడరూరల్,భారతీయ జనతాపార్టీ నమో యువ సమ్మేళనసన్నాహకసమావేశం



వేములవాడ,జూన్,16:ప్రజాజ్యోతి. వేములవాడ రూరల్ మండల కేంద్రంలో నమో జనరేషన్ జెడ్ యువ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 20న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న యువ సమ్మేళనం విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జింక అనిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రిగా పన్నెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువతలో దేశభక్తి, దేశ అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ పరిపాలన పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే యువ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. యువతను అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యేలా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో మండల ప్రధానకార్యర్శి తోట శేఖర్ సామోజీ గౌతమ్ శ్రీరామోజీ శివ సుంక మల్లికార్జున్ సుంకరి రాజు రాజశేఖర్ శివ చెందు గణేష్ బన్నీ గణేష్ రాకేష్ శ్రీను కమలాకర్ భారతీయ జనతా యువ మోర్చా ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# క్రీడా ప్రతిభకు చిరునామా బ్లూ బెల్స్ హైస్కూల్

కరీంనగర్ టౌన్ జూన్ 16 (ప్రజా జ్యోతి ) హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్స్‌లో సీట్లు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది.పాఠశాలకు చెందిన జి. మోక్షిత్ కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కాగా, ఎం. వేదాన్ష్ హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీత మనోహర్ రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, వారి భవిష్యత్ విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యా రంగంతో పాటు క్రీడా రంగంలోనూ రాణిస్తూ తమ ప్రతిభను చాటుకోవడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థుల ఈ విజయాల వెనుక ఉన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు క్రీడా శిక్షకుల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి



పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు.

# డ్రాగ్‌లైన్ రాగి చోరీకి శ్రీజ ఇన్ఫ్రాకు సంబంధం లేదు :  నాగండ్ల రవికుమార్

- ఎఫ్ఐఆర్‌లో రూ.1 లక్ష నష్టం..
  సింగరేణి రికవరీ మాత్రం రూ.16 లక్షలు
- భద్రతా బాధ్యతలు మరో కాంట్రాక్టర్ పరిధిలో ఉండగా  తమ సంస్థను లక్ష్యంగా చేసుకున్నారనీ ఆరోపణ
- సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులు జోక్యం చేసుకుని నిష్పక్షపాత విచారణ జరపాలని విజ్ఞప్తి



**రామగిరి, జూన్ 16 (ప్రజాజ్యోతి) :** సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో చోటుచేసుకున్న డ్రాగ్‌లైన్ స్క్రాప్ చోరీ కేసు కొత్త మలుపు తిరిగింది. సింగరేణి భద్రతా అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన దొంగతనం కేసులో తనను అన్యాయంగా ఇరికించి, భారీ మొత్తంలో రికవరీ విధించే ప్రయత్నం జరుగుతోందని బాధిత శ్రీజ ఇన్ఫ్రా కాంట్రాక్టర్ నాగండ్ల రవికుమార్ ఆరోపించారు. మంగళవారం చెట్టిన రికార్డింగ్లోని సాయిరాం గార్డెన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. బాధిత కాంట్రాక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం, శ్రీజ ఇన్ఫ్రా సంస్థకు చెందిన సెక్యూరిటీ కాంట్రాక్ట్ 2023 మార్చి 2న ప్రారంభమై 2026 ఏప్రిల్ 15న ముగిసింది. కాంట్రాక్ట్ ముగిసిన విషయాన్ని సింగరేణి ఏరియా సెక్యూరిటీ కార్యాలయం అధికారికంగా లేఖ ద్వారా ధృవీకరించినట్లు ఆయన వెల్లడించారు. అయితే, కాంట్రాక్ట్ ముగిసిన ఆరు రోజుల తర్వాత, అంటే 2026 ఏప్రిల్ 21న జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనం ఘటనకు తనను బాధ్యుడిగా పేర్కొంటూ రూ.16 లక్షల నష్టం భరించాలని నోటీసులు జారీ చేయడం పూర్తిగా అన్యాయమని అన్నారు. దొంగతనం కేసులో పేర్లు వచ్చిన సెక్యూరిటీ గార్డులు శ్రీజ ఇన్ఫ్రా నియమించిన సిబ్బంది కాదని, వారు గత ఆరు సంవత్సరాలుగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారేనని పేర్కొన్నారు. అంతేకాకుండా, సంఘటన జరిగిన సమయంలో భద్రతా బాధ్యతలు మరో కాంట్రాక్టర్ పరిధిలో ఉన్నప్పటికీ, తమ సంస్థనే లక్ష్యంగా చేసుకోవడం వెనుక కక్షపూరిత ధోరణి ఉందనే అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. ఈ కేసులో మరో కీలక అంశాన్ని  రవికుమార్ ప్రస్తావించారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో దొంగిలించబడిన స్క్రాప్ విలువ సుమారు రూ.1 లక్షగా నమోదైందని, అయితే సింగరేణి అధికారులు మాత్రం ఎలాంటి స్పష్టమైన లెక్కలు, ఆధారాలు వెల్లడించకుండా రూ.16 లక్షల రికవరీ విధించారని చెప్పారు. ఎఫ్ఐఆర్‌లో ఉన్న మొత్తానికి, రికవరీగా విధించిన మొత్తానికి మధ్య ఉన్న భారీ వ్యత్యాసంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించి తనకు ఎలాంటి షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, వివరణ కోరే అవకాశం కల్పించకుండా, అంతర్గత విచారణ చేపట్టకుండా నేరుగా రికవరీ నిర్ణయం తీసుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని  ఆరోపించారు. ఒక వ్యక్తిని లేదా సంస్థను బాధ్యులుగా నిర్ణయించే ముందు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియను పక్కనపెట్టడం వెనుక ఉద్దేశాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. డ్రాగ్‌లైన్ వంటి అత్యంత విలువైన యంత్రాల వద్ద భద్రతా వ్యవస్థ ఎలా విఫలమైందనే అంశంపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని బాధిత కాంట్రాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. ఘటన జరిగిన సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది ఎవరు? పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించిన అధికారులు ఎవరూ? భద్రతా లోపాలను గుర్తించడంలో ఎందుకు విఫలమయ్యారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు వెలికితీయకుండా, కాంట్రాక్ట్ ముగిసిన సంస్థపై చర్యలు తీసుకోవడం ద్వారా అసలు బాధ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. సింగరేణి వంటి ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ సంస్థలో భద్రతా వ్యవస్థ వైఫల్యానికి బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, లేకపోతే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ఒకవేళ భద్రతా లోపాలు నిజంగానే చోటుచేసుకుని ఉంటే, వాటికి బాధ్యులైన అధికారులను వదిలేసి, సంబంధం లేని వ్యక్తులను బలిపశువులుగా మార్చడం సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి నిష్పక్షపాత విచారణ జరిపించాలని బాధిత శ్రీజ ఇన్ఫ్రా కాంట్రాక్టర్ నాగండ్ల రవికుమార్ కోరారు. డ్రాగ్‌లైన్ స్క్రాప్ చోరీ ఘటనకు నిజమైన బాధ్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, తనపై విధించిన రూ.16 లక్షల రికవరీ ఉత్తర్వులను రద్దు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మూత్రశాలలు కరువు

**కాల్వ శ్రీరాంపూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి)**
కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్లే రోగులకు మూత్రశాలలు లేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చుట్టూ పక్కల గల వివిధ గ్రామాల్లోని రోగులు వైద్యం కొరకు ఆసుపత్రికి వస్తుంటారు. కొందరు రోజుల తరబడి వైద్యం కొరకు బెడ్డు కు ఉంటున్నారు. మూత్ర శాలలు లేక పోవడంతో ఆరు బయటనే మూత్రవిసర్జన చేయవలసి వస్తుంది. దీనితో శ్రీలు మూత్ర విసర్జన చేయడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. అనారోగ్యంతో ఉండి చికిత్స పొందే వారు ఆరు బయటకు వెళ్లడం పెద్ద సమస్యగా మారిందని వాపోతున్నారు. మూత్రశాలలు బాగు చేయడానికి వైద్యులు కృషి చేస్తున్నప్పటికీ నిధులు లేక నత్తనడకన పనులు కొనసాగిస్తున్నారు. గత ఏళ్ల నుండి ఈ దిస్థితి కొనసా గుతున్న సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు చూస్తూ ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకు 30 పడుక ల పడకల ఆసుపత్రి అయినప్పటికీ. వ మూత్రశాలలు లేకపోవడం ఏమిటని పలువురు విమర్శిస ్తున్నారు. ఇప్పటికైనా సం బంధిత అధికారులు ప్రజాప్రతినిధులు చర్య తీసుకొని మూత్రశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి. వెంటనే నిర్మాణం చేపట్టాలని. ఆయా గ్రామాల రోగులు. ప్రజాప్రతినిధులు



# సెల్ ఫోన్ కొనివ్వలేదని యువకుని ఆత్మహత్య



**చొప్పదండి, జూన్ 16 (ప్రజాజ్యోతి):** తన సోదరులు సెల్ ఫోన్ కొనివ్వలేదని మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న యువకుని ఉదంతం చొప్పదండిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ రెడ్డి వివరాల ప్రకారంబీహార్  రాష్ట్రం అరలియా జిల్లా కు చెందిన నితీష్ కుమార్ కు మొత్తం ఐదుగురు అన్నదమ్ములు. అందులో చిన్నవాడు నితీష్ . పెద్ద అన్నయ్య కామారెడ్డిలో ఒక గల రైస్ మిల్ లో పనిచేస్తున్నాడు. బీహార్ నుండి ఒక వ్యక్తి కామారెడ్డి లో గల తన పెద్దన్నయ్య పని చేస్తున్న రైస్ మిల్ కు పోతు న్నాను అనడంతో అతనితోపాటు కామారెడ్డికి 10రోజుల క్రితం వచ్చాడు. నితీష్ తన అన్నయ్యను స్మార్ట్ ఫోన్ కావాలని స్మార్ట్ ఫోన్ కొరకై రు.10000 నుండిరు. 15000 అవుతాయని తెలపగా ప్రస్తుతం తన దగ్గర అమౌంట్ లేవు. అమౌంట్ సర్దుబాటు అవ్వగానే కొనిస్తానని సర్ది చెప్పాడు. తిరిగి నితీష్ ను బీహార్ పంపేందుకు కామారెడ్డి నుండి  బీహార్ వెళ్లేందుకు ఎవరూ లేకపోవడంతో నితీష్ యొక్క నాలుగవ అన్న చొప్పదండిలో  హరిప్రియ రైస్ మిల్లు పనిచేస్తుండడంతో చొప్పదండి నుండి వాళ్ల రాష్ట్రం బీహార్ వెళ్లేందుకు మనుషులు ఉండడంతో ఈనెల 13న చొప్పదండి లో గల హరిప్రియ రైస్ మిల్ కు వాళ్ళ నాలుగవ  అన్న దగ్గరికి పంపించాడు. మంగళవారం బీహార్ కు వెళ్లే వాళ్లతో కలిసి వాళ్ళ తమ్ముడిని పంపించే ఏర్పాటు చేశారు. అంతలోనే నితీష్  వాళ్ళ యొక్క సొంత అన్నలు స్మార్ట్ ఫోన్  కొనివ్వలేదని మనస్థాపానికి గురై సోమవారం రాత్రి  హమాలీ రూంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.  చొప్పదండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మచ్చుపేట గ్రామానికి గ్రామ కార్యదర్శిని నియమించండి..

**గ్రామ కార్యదర్శిని నియమించాలని మండల అధికారులను కోరిన ఉపసర్పంచ్..**



**ముత్తారం జూన్,16 (ప్రజా జ్యోతి)** మండలంలోని మచ్చుపేట గ్రామానికి వెంటనే పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఉప సర్పంచ్ దొంతుల రాకేష్ మంగళవారం అధికారులను కోరారు. జూన్ 6 న నిర్వహించిన గ్రామ సభకు పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ బాబు హాజరు కాలేదని జూన్ 7 నుంచి కాంర్యదర్శి ఎంపీడీవో కార్యాలయానికి హాజరవుతూ గ్రామ పంచా యతీలో విధులు నిర్వహించడం లేదని అన్నారు. గ్రామానికి కార్య దర్శి లేక ఇంటి నిర్మాణ అనుమతులు,కొత్త పిం ఛన్ దరఖాస్తులు, విద్యుత్ మీటర్ల కోసం ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి మచ్చుపేట గ్రామానికి శాశ్వత పంచాయతీ కార్యదర్శిని నియమి చాలని ఉప సర్పంచ్ దొంతుల రాకేష్ మండల అధికారులను కోరారు.

## శబరిమలలోవేములవాడ ఎమ్మెల్యే



**వేములవాడ,జూన్,16:ప్రజాజ్యోతి.** వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శబరిమలలో అయ్యప్ప దర్శనం కొరకు చిన్న పాదం నుండి కాలినడకన వెళ్లి అయ్యప్ప దర్శనం చేసుకున్నారు ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు బాగా పండాలనినియోజకవర్గంఅభివృద్ధి చెందాలని మొక్కుకున్నారు

# జమ్మికుంటలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

**జమ్మికుంట, జూన్ 16 ( ప్రజాజ్యోతి ):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే లో భాగంగా జమ్మికుంటలో గణాంక శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామిని కలిసి సర్వే కరపత్రాలను అందజేసి దాని ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించి ప్రజల ఉపాధి స్థితిగతులను తెలుసుకునేందుకు ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన పట్టణాలు, గ్రామాల్లో ముందుగా సాధారణ వివరాలను సేకరించి, అనంతరం ఎంపిక చేసిన కుటుంబాలపై మూడు నెలల పాటు నెలకోసారి మొబైల్ ట్యాబ్‌ల ద్వారా పూర్తి స్థాయి సర్వే నిర్వహిస్తామని చెప్పారు. సర్వేలో కుటుంబ సభ్యుల విద్యార్హతలు, చదువు మానేసిన వివరాలు, ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలీ పనులు, పని గంటలు, వేతన వివరాలను నమోదు చేస్తారు. అలాగే మహిళల



స్వయం ఉపాధి ఆదాయ వివరాలతో పాటు జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబర్ వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పనిచేసే గిగ్ వర్కర్లు, ఆన్‌లైన్ డెలివరీ ఉద్యోగుల సమాచారాన్ని కూడా సేకరిస్తారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బత్తుల లక్ష్మయ్య, మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, వార్డు అధికారి కుమారస్వామి, బిల్ కలెక్టర్, మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు శ్రీదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

# అన్ని స్కాంలే స్కీములు పక్కన పెట్టిండ్రు

**- మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు**



**తిమ్మాపూర్,జూన్ 16 (ప్రజాజ్యోతి)** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ 8వ డివిజన్ పరిధిలోలోని లక్ష్మీ నరసింహా గార్డెన్ లో మంగళవారంబిఆర్ఎస్ పార్టీ నియోజక వర్గ విస్తృత స్థాయి సమా వేశం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణా రావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు డిజి టల్ సర్'పై అవగాహన సన్నాహాక సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి హరీష్ రావు,పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి,బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు హాజర య్యారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మొలకెత్తిన వడ్లు కొనని మొఖం మనని మొలకెత్తనియ్య అంటండు.రేవంత్ పాలనలో సంక్షేమ పథకాలకు సంబంధించిన ఏ స్కీములు లేవు అన్ని స్కాంలే మనసు పెట్టీ పోరాడిన కార్యకర్తలు మానకొండూర్ కార్యకర్తలుఉద్యమ సమయంలో ప్రాణం పెట్టి పోరాడిన నియోజకవర్గం మానకొం డూర్.ఓటమి అంచున ఉన్నవాడే కేసులు పెడ తడు.ఎన్ని కేసులు పెడితే అంత గెలుపుకు దగ్గరగా వెళ్తున్నామని అర్థం.మొలకెత్తిన వడ్లు కొనే మొకం లేదు గానీ.బీఆర్ ఎస్ ను మొలకెత్తకుండా చేస్తామని సీఎం అంటడు.కేసీఆర్ పాలనలో అన్ని స్కీములుంటే.రేవంత్ పాలనలో ఏ స్కీమ్ చూసినా స్కాంలే,స్కాం లేని స్కీము,డిపార్ట్మెంట్ లేదు. ఆఖరుకు చదువుకునే పిల్లలకు సంబంధించిన ప్రభుత్వ హాస్టల్లోఉప్పు, పప్పు,గుడ్ల మీద స్కాం స్కామ్ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవ చేశారు. పేదలు,రైతులు అంటే గిట్టని సీఎం రేవంత్ రెడ్డి అన్ని ధరలు పెంచి పేద సామాన్య ప్రజల నడ్డి విరు స్తున్నారు. రైతు సంక్షేమ పథకాలను పూర్తిగా మరిచి, రైతుబంధు,రైతు బీమా పథ కాలను ఎగ్గొట్టి, రైతులు పండించిన వరి పంటలను సకాలంలో కొనుగోలు చేయకపోగా,తరుగు పేరు తో రైతులను దోపిడీ చేస్తు న్నారని,రైతులకు సరిపడా ఎరువులు,విత్తనాలు అం దించడంలో కాంగ్రెస్ ప్రభు త్వం విఫలమైందని విమ ర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో లో మహిళలను కోటీశ్వరు లను చేస్తానన్న రేవంత్ రెడ్డి,30 నెలల రేవంత్ రెడ్డి పాలనలో కోటీశ్వరులేమో గానీ,ఎనుమాముల వారి నలుగురు తమ్ములు మాత్రం కోటీశ్వరులు అయ్యారు. 30లక్షల మంది విద్యా ర్థులకు రీయంబర్స్మెంట్ ఫీజు బకాయిలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు, వారి తల్లిదండ్రుల ఉసురు కాంగ్రెస్ కు తగులుద్ది అని శాపనార్థం పెట్టారు.

సీఎం రేవంత్ రెడ్డికి

క్యాంపు ఆఫీసుల మీద, మెస్సీతో ఫుట్ బాల్ ఆడ టానికి,మహిళల అందాల పోటీలకు,మూసి సుందరీ కరణకు,ఏ రాష్ట్రంలో ఎన్ని కలు జరిగితే ఆ రాష్ట్రంలో యాడ్లు ఇచ్చుడు,మూటలు పంపుడుకు పైసలు ఉంటా యి. కానీ పేదలకు సంక్షేమ పథకాలు ఇచ్చేందుకు పైసలు ఉండవా అంటూ నిలదీస్తూ ప్రశ్నించారు. దేవుని మీద ప్రమాణం చేసి, మోసం చేసిన ఈ ఎగవేతల రేవంత్ రెడ్డిని నేను అన్నం దుకు మానకొండూర్ లో నా మీద కేసు పెట్టిండు. రైతును నిండా ముంచింన రేవంత్ రెడ్డి 19వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టింది. కానీ గత కెసిఆర్ పాలనలో రైతుబంధు,రైతు బీమా భీమా వంటి సంక్షేమ పథకాలు ఆగినవా అని నిల దీశారు. వ్యవసాయ రైతు లకు వరి బోనస్ అంతా బోగస్ అయ్యింది,24 గం టల కరెంట్ నుంచి 11 గంట లకు వచ్చింది. రైతు డిస్కం అనే భూతం రాబోతుంది, దీని పేరిట రైతుల ఉసురు పోసు కోబోతున్నడు మన సీఎం రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ పాలనలో విసుకెత్తిన పేద, సామాన్య అన్ని వర్గాల ప్రజ ల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపే చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చినాకా నువ్వు ఎన్నివేల ఉద్యోగాలు ఇచ్చి నవ్ అడిగితే 16 వేలు ఇచ్చి నా అని చెప్పిండు.బయట నేమో 60వేలు అని చెప్తు న్నడు. అన్ని వర్గాలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. గత బిఆర్ఎస్ హాయంలో 23లక్షల కొత్త ఆయకట్టుకు నీళ్లు ఇచ్చింది.రెండున్నరేళ్లలో ఈ కాంగ్రెస్ రెండెకరాలకైనా నీళ్లు ఇచ్చిందా,అబద్ధాల పునాదు లపైనే కాంగ్రెస్ బతుకు తోంది.ఇక నైనా తెలంగాణ ప్రజలు మేలుకొని రేపటి తరం బాగు కోసం బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.సర్ పై మాట్లాడుతూ2002 లో ఓటు హక్కు ఉంటే ఫ్యామిలీ గ్రూపింగ్ చేస్తరు. ఓటు హక్కు లేకుంటే కొన్ని పత్రాలు అడుగుతరు. అన్ని రాజ కీయ పార్టీలకు సర్ పై అవకాశం కల్పించింది.కార్యకర్తలు బూత్ లెవెల్ ఆఫీసర్ వెంట వెళ్లి ఫాం నింపి ఇవ్వొచ్చు. ఎవరి ఓటు మిస్ కాకుండా చూడ డానికి మనకి ఇదొక అవకాశం అని పార్టీ శ్రేణులను ఉద్దేశించి అన్నారు.ఈ కార్యక్రమంలోమాజీ మంత్రి హరీష్ రావు,పార్టీ ప్రధాన కార్య దర్శి జీవన్ రెడ్డి,ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్,పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్,

జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు,స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేశం, నాయకులు ఎల్ రమణ, చల్ల హరి శంకర్,సర్దార్ రవీందర్ సింగ్, సింగిరెడ్డి స్వామి రెడ్డి,కేతిరెడ్డి దేవేం దర్ రెడ్డి,ఉల్లెంగల ఏకానం దం,రావుల రమేష్ తో పాటు రాష్ట్ర,జిల్లా నాయకు లు,ప్రజాప్రతినిధులు, కార్య కర్తలు,అభిమానులు, ప్రజ లు పెద్ద ఎత్తున పాల్గొ న్నారు.



# హుజూరాబాద్‌లో ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం

## – చిన్నారులకు అక్షర స్వీకారం చేసిన డీఈవో ప్రశాంత్ రెడ్డి



**జమ్మికుంట, జూన్ 16 ( ప్రజాజ్యోతి ):** బడిబాట షెడ్యూల్‌లో భాగంగా హుజూరాబాద్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నరెడ్ల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నట్లు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్షరాభ్యాసం కేవలం సంప్రదాయం మాత్రమే కాకుండా పిల్లల విద్యా జీవితానికి తొలి మెట్టు అని, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. డీఈవో ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలల పునఃప్రారంభ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగాయని తెలిపారు. అక్షరాభ్యాసం స్వీకరించిన చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తాను హుజూరాబాద్ వాసినని, స్థానిక శిశు మందిర్‌లోనే విద్యాభ్యాసం చేశానని గుర్తు చేసుకున్నారు. మండలంలోని పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మండల విద్యాధికారిని ఆదేశించారు. అనంతరం కొత్తగా పాఠశాలలో చేరిన చిన్నారులకు స్వయంగా అక్షర స్వీకారం చేయించి ఆశీర్వదించారు. మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ డీఈవో హుజూరాబాద్‌కు రావడం ఆనందంగా ఉందని, ఆయన సూచనల మేరకు విద్యా కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కోయల్‌కార్ భారతి, సొల్లు సునీత, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు డీఎం శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోగుల రాధిక, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్ 45వ డివిజన్‌లో సి.ఎస్.ఆర్ నిధులతో నూతన ఓపెన్ జిమ్ ప్రారంభం



**కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 17(ప్రజా జ్యోతి ):-** కరీంనగర్ నగరంలోని 45వ డివిజన్ మంకమ్మ తోట లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఓపెన్ జిమ్' ఘనంగా ప్రారంభమైంది. ఈ ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ ప్రజల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన 'ఫిట్ ఇండియా' నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని నగరంలో ఈ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక సహకారంతో, సీఎస్ఆర్ నిధులను వెచ్చించి నగరంలో ఈ ఓపెన్ జిమ్ లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.?ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ-శ్రీనివాస్, బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

## – మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మారం,జూన్16(ప్రజాజ్యోతి న్యూస్):** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ కట్ట అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. నందిమేడారం గ్రామంలో సోమవారం విద్యుత్ మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్న సమయంలో కట్ట అశోక్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. మొదట ఆయనను కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అశోక్ మృతి విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళ వారం ఉదయం గాంధీ ఆసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అశోక్ మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు. మంత్రి వెంట నందిమేడారం గ్రామ సర్పంచ్ వీర్‌పాల్‌తో పాటు ధర్మారం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



**కరీంనగర్ క్రైం, జూన్ 17, ప్రజాజ్యోతి:** కరీంనగర్ రూరల్ మండలంలోని ఇ రుకు ల్లా గ్రామ శివార ులోని ఓ మామిడి తోటలో గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. సుమారు 35-40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ఎర్రటి టీ-షర్టు ధరించి మామిడి చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో కనిపించగా, మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, గ్రామస్తుల సహాయంతో మృత దేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడిని ఎవరూ గుర్తించలేదని, అతడు స్థానికుడు కాదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. మృతుడి వివరాలు తెలిసిన వారు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి కోరారు.

# ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాలు



**గొల్లపల్లి జూన్ 16 (ప్రజాజ్యోతి)** గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి మహిళలు బోనాలు తీసి మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. గౌడ కులస్థులు బోనాలతో ఊరేగింపుగా డప్పు చప్పుళ్లతో ఆలయంకు వెళ్లి ఎల్లమ్మకు బోనం సమర్పించుకొని ఒడి బియ్యం పోసి మొక్కులు సమర్పించుకున్నారు. వర్షాలు సమృద్ధి గా కురియాలని పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ భవాని, అరవింద్ గౌడ్ గౌడ సంఘం అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, ఉపాధ్యక్షుడు తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్ తిరుపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్, డైరెక్టర్లు శంకరయ్య గౌడ్, దేవేందర్ గౌడ్, రాజన్న గౌడ్ నరేష్ గౌడ్ వెంకటేష్ గౌడ్ జనార్ధన్ గౌడ్ నాయకులు అంజయ్య గౌడ్ మహేష్ గౌడ్ శంకరయ్య గౌడ్ నారాయణ గౌడ్ గంగరాజం గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## కరీంనగర్ ఆర్టీసీ కార్గో కేంద్రంలో

# గందరగోళం

- కేంద్రం మార్పుతో కస్టమర్లకు చుక్కలు.. బుకింగ్ ఒకచోట, డెలివరీ మరోచోట
- వాహనాల ప్రవేశంపై ఆంక్షలు.. బస్సుల మార్గంలోనే సరుకుల గుట్టలు
- సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనతపై వినియోగదారుల ఆగ్రహం







**కరీంనగర్ బ్యూరో,జూన్ 16 (ప్రజాజ్యోతి ):** ప్రజలకు వేగవంతమైన పార్శిల్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నడుస్తున్న ఆర్టీసీ కార్గో సేవలు కరీంనగర్‌లో ప్రస్తుతం వినియోగదారులకు ఇబ్బందుల పర్యాయపదంగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కార్గో కేంద్రాన్ని పాత ప్రదేశం నుంచి బస్ స్టాండ్ ప్లాట్‌ఫాం పక్కకు తరలించిన తర్వాత కస్టమర్లు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వ్యాపారులు, చిన్న వ్యాపార సంస్థల ప్రతినిధులు, సాధారణ ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

### పాత కేంద్రంలో సౌకర్యం.. కొత్త కేంద్రంలో అయోమయం

గతంలో కార్గో కేంద్రం సులభంగా చేరుకునే ప్రదేశంలో ఉండటంతో సరుకుల బుకింగ్, డెలివరీ ప్రక్రియ సాఫీగా సాగేది. వాహనాలతో నేరుగా వెళ్లి సరుకులు అందజేయడం, తీసుకురావడం సులభంగా ఉండేది. కానీ ప్రస్తుతం బస్ స్టాండ్ ప్లాట్‌ఫాం పక్కకు తరలించిన తర్వాత కస్టమర్లు ఎక్కడికి వెళ్లాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు.ప్రత్యేకించి ఇతర పట్టణాల నుంచి సరుకులు తీసుకోవడానికి వచ్చే వారు కార్గో కేంద్రం కోసం బస్ స్టాండ్ మొత్తం వెతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు చెబుతున్నారు.

### బుకింగ్ ఒకచోట.. డెలివరీ మరోచోట

కస్టమర్లను ఎక్కువగా ఇబ్బందులకు గురిచేస్తున్న అంశం బుకింగ్, డెలివరీ కేంద్రాలు వేర్వేరు ప్రదేశాల్లో ఉండటమే. సరుకులను పంపించేందుకు ఒక ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుండగా, వాటిని స్వీకరించడానికి మరో ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోంది.

దీంతో ఒకే పనికోసం పలుమార్లు తిరగాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. సరైన సూచిక బోర్డులు లేకపోవడంతో కొత్తగా వచ్చే వారు సిబ్బందిని అడుగుతూ తిరుగుతున్న దృశ్యాలు నిత్యం కనిపిస్తున్నాయి.

వాహనాలను అడ్డుకుంటున్న భద్రతా సిబ్బంది

కార్గో కేంద్రం వరకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న లోడింగ్ వాహనాలు వెళ్లేందుకు అనుమతి ఇవ్వడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. భద్రతా కారణాలు చూపుతూ ఆర్టీసీ కానిస్టేబుల్ వాహనాలను అడ్డుకుంటున్నారని చెబుతున్నారు. భారీ సంచులు, పార్శిళ్లు, వ్యాపార సరుకులు తీసుకొచ్చే వారు వాటిని దూరం నుంచి మోసుకెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, చిన్న వ్యాపారులు మరింత ఇబ్బందులు పడుతున్నారని వినియోగదారులు పేర్కొంటున్నారు.

### బస్సుల రాకపోకల మార్గంలోనే సరుకుల నిల్వ

కార్గో కేంద్రం వద్ద వచ్చిన పార్శిళ్లు, సంచులు, బాక్సులను బస్సులు లోపలికి వెళ్లే మార్గం పక్కనే ఉంచుతున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీంతో బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతుండటమే కాకుండా ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని అంటున్నారు.వర్షాకాలంలో సరుకులు తడిసిపోవడం, ప్రయాణికులు వాటిని తప్పించుకుని నడవాల్సిన పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయని చెబుతున్నారు.కస్టమర్లు పంపించిన సంచులు, పార్శిళ్లను సిబ్బంది జాగ్రత్తగా నిర్వహించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో సరుకులను విసిరివేయడం, ఒకదానిపై మరొకటి వేయడం వల్ల వస్తువులు దెబ్బతింటున్నాయని వ్యాపారులు వాపోతున్నారు.పగిలే వస్తువులు, ఎలక్ట్రానిక్ సామగ్రి, వ్యాపార అవసరాల కోసం పంపించే వస్తువులు నష్టపోతే బాధ్యత ఎవరిదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కార్గో కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బందిలో కొందరు కస్టమర్లతో మర్యాదగా వ్యవహరించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. వాహనాలను అడ్డుకోవడం, ప్రశ్నలు అడిగిన వారిపై అసహనం ప్రదర్శించడం, సమస్యలను వినకపోవడం వంటి చర్యలపై పలువురు వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.





# ఫ్లెక్సీల ఖర్చు గ్రామాభివృద్ధికి వినియోగించండి”

## - ఎంపీ ధర్మపురి అరవింద్



రాయికల్,జూన్ 16 (ప్రజా జ్యోతి) జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్ మండలం ధర్మాజీపేట గ్రామంలో రూ.23 లక్షల వ్యయంతో (రూ.20 లక్షలు కేంద్ర ప్రభుత్వం, రూ.3 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం) ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖానా)ను మంగళవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ కలిసి ప్రారంభించారు.కార్యక్రమానికి ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నినాదాలు చేయడంతో ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందిస్తూ, “ఎవ్వరూ నాతో రాజకీయాలు చేయకండి... మీరు చేయలేరు కూడా” అని వ్యాఖ్యానించారు. ఫ్లెక్సీలపై అధికంగా ఖర్చు చేయడం కంటే ఆ నిధులను గ్రామాభివృద్ధి, ప్రజా అవసరాలకు వినియోగించాలని సూచించారు. “ఫ్లెక్సీలపై పెట్టే ఖర్చును పీహెచ్‌సీకి లేదా గ్రామాభివృద్ధికి కేటాయిస్తే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుంది. ఇకపై ఫ్లెక్సీలపై అనవసర ఖర్చు చేయవద్దు” అని అన్నారు.అదేవిధంగా, “కాంగ్రెస్‌లో నాకు తెలియని నాయకులు ఎవరూ లేరు. నినాదాలు ఆపండి. జగిత్యాల నియోజకవర్గంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఏ పార్టీ వారు ఏ పార్టీకి సంబంధించిన నినాదాలు చేస్తున్నారో అర్థం కావడం లేదు” అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రూ.23 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి, ధర్మాజీపేట సర్పంచ్ వాకిటి గంగారెడ్డి, బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, రాయికల్ మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, జిల్లా, మండల పదాధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటాం

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్



రాయికల్ జూన్ 16 (ప్రజా జ్యోతి) రాయికల్ మండలం వడ్డే లింగాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు వద్లూరి రాజేందర్ (40) దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను నాయకులు మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజేందర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గల్ఫ్ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పరామర్శ కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ దినేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ మానస సాయి, మాజీ సర్పంచ్ రవి, నాయకులు రమేష్, ఈదుల లక్ష్మణ్, ఉప సర్పంచ్ శంకర్, వద్లూరి లక్ష్మణ్, రాజన్న, మండల నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్




కథలాపూర్, జూన్ 16(ప్రజాజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించి అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కథలాపూర్ ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. కథలాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి డయల్-100కు వచ్చిన సమాచారంతో బ్లూకోల్ట్ పోలీసులు కానిస్టేబుళ్లు దినేష్, శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గొడవ పడుతున్న వ్యక్తిని ప్రశ్నించగా, కథలాపూర్ గ్రామానికి చెందిన శంభోజి పవన్ కువార్ మద్యం మత్తులో పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు వారిని నెట్టివేసి విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రవికిరణ్ వెల్లడించారు. చట్టాలను గౌరవిస్తూ ప్రజలు పోలీసులకు సహకరించాలని, విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవికిరణ్ హెచ్చరించారు.

# అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం



(కోరుట్ల రూరల్, ప్రజా జ్యోతి, జూన్ 16) కోరుట్ల మండలంలోని మోహన్ రావు పేట గ్రామంలో మంగళవారం రోజున అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు అంగన్వాడి సూపర్వైజర్ చేతుల మీదుగా ఈ అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ సరికెల్ల లతికా నరేష్ మాట్లాడుతూ మన ఊరి అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిం ద న్నారు. పిల్లలకు పౌష్టికాహారం అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలకు ప్రభుత్వం అందజేస్తుందని ప్రతి ఒక్కరు తమ ఇంట్లో చిన్నపిల్లల్ని అంగన్వాడి కేంద్రానికి పంపించాలని కోరారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, పిల్లలు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ అంతరాయాలకు చెక్

### లక్ష్మీపూర్‌లో 33 కేవీ లైన్ ప్రారంభం

జగిత్యాల రూరల్, జూన్ 16 (ప్రజాజ్యోతి): లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు కీలక అడుగు వేశారు. లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ కోసం నూతనంగా నిర్మించిన 33 కేవీ విద్యుత్ లైన్‌ను మంగళవారం టీజీ ఎన్‌పీడీసీఎల్ జగిత్యాల సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం ప్రారంభించారు.?ఈ సందర్భంగా అధికారులుమాట్లాడుతూ.. గతంలో జగిత్యాల 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి గొల్లపల్లి ఫీడర్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగేదని, అందులో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు సరఫరాకు అంతరాయం కలిగేదని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా ధర్మారం 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ అందేలా ఈ నూతన 33 కేవీ లైన్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ లైన్ అందుబాటులోకి రావడం ద్వారా లక్ష్మీపూర్ పరిధిలోనివినియోగదారులకు ఇకపై నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుతుందని వారు స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ కె. గంగారాం, ఏడీఈలు బి. జవహర్లాల్ నాయక్, పి. వరుణ్ కుమార్, ఏఏఈ బి. సుందర్ నాయక్, సబ్ ఇంజనీర్ ఎస్. రంజిత్, లైన్ ఇన్‌స్పెక్టర్ బి. రవిశంకర్ రావు, కాంట్రాక్టర్ సుజిత్ రాథోడ్, పోలాస విద్యుత్ శాఖ సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం చాటిన లింగంపేట సర్పంచ్



భీమారం జూన్ 16 ప్రజాజ్యోతి జగిత్యాల జిల్లా భీమరం మండలం లింగంపేట గ్రామ సర్పంచ్ వెల్మల సుప్రియ, హరీష్ రెడ్డి దంపతులు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తమకు ఉన్న విశ్వాసాన్ని ఆచరణలో చూపిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా ప్రభుత్వ పా ఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందుతుందనే సందేశాన్ని గ్రామ ప్రజలకు అందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే సామర్థ్యం ప్రభుత్వ పాఠశాలలకు ఉంది. అందుకే మా కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం” అని తెలిపారు సర్పంచ్ దంపతులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు అభినందిస్తూ, ప్రభుత్వ విద్యాభివృద్ధికి ఇది ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.